ప్రజాశక్తి
సోమవారం 1 డిసెంబరు 2025

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో వెల్లడించారు. అర్జీదారులు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అర్జీదారుల అర్జీల నమోదు, నమోదైన అర్జీల గురించి వాటి స్థితి దానికి సంబంధించి సమాచారం గురించి తెలుసుకోవాలంటే 1100 నేరుగా కాల్ చేయొచ్చని తెలిపారు. అర్జీదారులు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చి'వరి'లో దిత్వా గుబులు

- జిల్లాలో పలుచోట్ల పూర్తయిన కోతలు
- తుపానుతో ఆందోళనలో అన్నదాతలు
- పంటను రక్షించుకునేందుకు పాట్లు

పంట చేతికొచ్చే చి'వరి' వరకు అన్నదాతకు ఆందోళన తప్పడం లేదు. దిత్వా తుపాను ప్రభావంతో ఉత్తర కోస్తా జిల్లాలకు వర్షాలు కురిసే అవకాశముందన్న వాతావరణ శాఖ హెచ్చరికలు వారిని కలవరపాటుకు గురిచేస్తున్నాయి. మారిన వాతావరణ పరిస్థితులతో పంటను కాపాడుకునేందుకు రైతులు పొలాలకు పరుగులు తీశారు. జిల్లాలో చాలాచోట్ల వరి కోతలు పూర్తయ్యాయి. కొన్నిచోట్ల పంట కోసి కుప్పలుగా పోశారు. మరికొన్ని చోట్ల ముమ్మరంగా నూర్పులు సాగుతున్నాయి. వర్షాలు కురుస్తాయన్న వార్తల నేపథ్యంలో పంటను కాపాడుకునే పనిలో అన్నదాతలు నిమగ్నమయ్యారు. పొలాల్లో ఎండబెట్టడం కోసం ఉంచిన ధాన్యాన్ని ఇళ్లకు తరలిస్తున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఎచ్చెర్లలో కోత కోసిన వరి పంట

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 4,09,951 ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. సుమారు 11 లక్షల టన్నులు దిగుబడి ఉంటుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు అనుకూలించటంతో సాగునీటి కాలువల ఆయకట్టు, చెరువుల ఆయకట్టు కింద సైతం మెరుగ్గా పంటలు పండాయి. పోలాకి, నరసన్నపేట, జలుమూరు, రణస్థలం, పొందూరు, ఆమదాలవలస, శ్రీకాకుళం రూరల్ వంటి ప్రాంతాల్లో చాలావరకు కోతలు పూర్తయ్యాయి. తుపాను ప్రభావంతో వాతావరణంలో మార్పులతో కోత కోయని రైతులు వాయిదా వేసుకున్నారు. కోతలు కోసిన రైతులు పొలాల్లో ఉన్న వరి పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. కోత కోసి ఆరని ఓవులను గాలి దిబ్బలు పెట్టడం, ఆరిన వాటిని దిబ్బలు పెట్టారు. పొలాల్లో నీరు నిల్వకుండా బట్టెలు వేయడం వంటి పనుల్లో నిమగ్నమయ్యారు. గత నెలలో మొంథా తుపాను సమయంలో జిల్లాకు తీవ్రత ఎక్కువగా లేకపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. పంట పండేందుకు కొంత సమయం ఉండడంతో నష్టానికి తక్కువ అవకాశం కలిగింది. దిత్వా తుపాను ప్రభావంతో జిల్లాలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం ఉదయం వరకు ఎండ కాసినా, మధ్యాహ్నానికి మబ్బులు వేయడంతో కలవరపడ్డారు. కోతలు పూర్తయిన వరిపై కొద్దిపాటి వర్షం కురిసినా మొలకలు రావడం, ధాన్యం రంగు మారుతాయి. అందుకే పూర్తిగా పొలాల్లో వరి కంకెలు ఆరకపోయినా దిబ్బలు పెట్టాల్సి వస్తోంది.

ఎచ్చెర్ల మండలం ఇబ్రహీంబాద్‌లో పొలాల్లో వరి దిబ్బలు

నవంబరు ఒకటవ తేదీ నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, ధాన్యం కొనుగోలు చేస్తామన్న అధికారుల మాటలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సొంత జిల్లాలోనే ఇప్పటివరకు పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని స్పష్టం చేస్తోంది. జిల్లాలో 406 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు ప్రకటించినా, పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయకపోవడంతో రైతులు దళారుల బారినపడి నష్టపోతున్నారు. నూర్పులు పూర్తయిన ధాన్యం భద్రపరిచే పరిస్థితి లేకపోవడంతో దళారులకు తెగనమ్ముకుంటున్నారు. మరోవైపు రైతులకు ఉచితంగా టార్పాలిన్లు అందజేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటనలు ఆచరణలో కానరావడం లేదు. కోతలు, నూర్పులు పూర్తయిన దశలో ఏ మాత్రం వర్షం కురిసినా ధాన్యంతో పాటు పొలాల్లోని పంటలకూ నష్టం తప్పదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

తుపానుపై అప్రమత్తంగా ఉండాలి

బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వా తుపానుపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. తుపాను తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తా తీరాలను తాకే అవకాశం ఉన్నప్పటికీ.. సోమవారం నుంచి రాష్ట్రానికి భారీ వర్ష సూచన ఉందన్నారు. ప్రధానంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని, స్థానిక వ్యవసాయ అధికారులు, రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుని పంటలు కాపాడుకోవాలని కోరారు. పంట కోతల విషయంలో వ్యవసాయాధికారుల సూచనలు తీసుకుని ముందుకు వెళ్తే తక్కువ నష్టం వాటిల్లే అవకాశం ఉందని తెలిపారు. జిల్లాకు ప్రస్తుతానికి వాతావరణ శాఖ నుంచి రెడ్, ఆరెంజ్ అలర్ట్‌లు లేకపోయినా వర్ష సూచనలు స్పష్టంగా ఉన్నాయని తెలిపారు. వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పన

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని పెద్ద బమ్మిడిలో రూ.1.80 కోట్లతో సిసి రహదారి నిర్మాణ పనులకు మంత్రి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పంచాయతీల నిధులు మళ్లించింది తప్ప పైసా ఇచ్చింది లేదని విమర్శించారు. ఫలితంగా పంచాయతీలు పూర్తిగా నిర్వీర్యమయ్యే పరిస్థితి వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పంచాయతీల బలోపేతానికి చర్యలు తీసుకుంటోందన్నారు. సిసి రోడ్లు పూర్తయితే, పల్లె ప్రజలకు ప్రయాణ సౌలభ్యం ఉంటుందన్నారు. పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ కృష్ణమూర్తి, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే 'ప్రజా దర్బార్'

ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కార చర్యలు చేపట్టేందుకే 'ప్రజా దర్బార్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. రావివలస ఎండల మల్లికార్జునస్వామి, కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించడంపై పలువురు నాయకులు మంత్రిని కలిసి సత్కరించారు.

మెయిన్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

యు.పి.ఎస్.సి నిర్వహించే సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు అర్హత గల జిల్లాకు చెందిన బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు చెందిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సాధికారత అధికారి ఇ.అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఆధార్, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు జతపరచి తమ దరఖాస్తులను డిసెంబరు మూడో తేదీ లోగా శ్రీకాకుళం నగరంలోని వాంబే కాలనీలో గల బిసి స్టడీ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు డిసెంబరు 7వ తేదీన విశాఖపట్నంలో సివిల్ సర్వీసెస్ సిలబస్ ఆధారంగా ఆబ్జెక్టివ్ టైపులో స్క్రీనింగ్ పరీక్ష ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఈ స్క్రీనింగ్ పరీక్షలు మెరిట్, రిజర్వేషన్ ప్రాతిపదికపై అభ్యర్థులను ఎంపిక చేసి, బిసి భవన్, గొల్లపూడి, విజయవాడ శిక్షణా కేంద్రం ద్వారా ఉచిత శిక్షణతో పాటు స్టడీ మెటీరియల్, భోజన, వసతి సౌకర్యాలను ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు బయోడేటాతో పాటు టెన్త్, డిగ్రీ మార్క్‌లిస్టులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం (తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్ష లోపు), తెలుపు రేషన్ కార్డు గల వారు అర్హులని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు 8332852106, 7382975679 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

తీరంలో కోలాహలం

ప్రజాశక్తి - సంతబొమ్మాళి, వజ్రపుకొత్తూరు

తీర ప్రాంత గ్రామాల్లో పిక్నిక్ సందడితో కిటకిటలాడాయి. సంతబొమ్మాళి మండలంలోని భావనపాడు, మేఘవరం, సున్నాపల్లి, వజ్రపుకొత్తూరు మండలంలోని అక్కుపల్లి శివసాగర్ బీచ్‌కు విహారయాత్రకు యువత, మహిళలు పెద్దఎత్తున తరలి వచ్చి కేరింతలతో సందడి చేశారు. తోటల్లో సేదతీరుతూ, సముద్ర స్నానాలు చేశారు. అధిక సంఖ్యలో యాత్రికులు రావడంతో భావనపాడు తీరం కిటకిటలాడింది. అక్కుపల్లి తీరంలో సౌకర్యాలు లేని కారణంగా మహిళలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. టాయిలెట్స్ లేకపోవడం, సముద్ర స్నానాల అనంతరం మహిళలు దుస్తులు మార్చుకోవడానికి సౌకర్యాలు లేకపోవడంపై పర్యాటకులు అసంతృప్తికి గురయ్యారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు, మెరైన్ పోలీసులు సంయుక్తంగా పహారా కాసి, ప్రజలకు ప్రమాద హెచ్చరికలు సూచిస్తూ అవగాహన కల్పించారు.

వజ్రపుకొత్తూరు : తీరంలో పర్యాటకుల సందడి

'ఇంద్ర' బస్సు ఛార్జీలు 20 శాతం తగ్గింపు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళం - విజయవాడ ఇంద్ర ఎసి బస్సు ఛార్జీలను 20 శాతం మేర తగ్గించినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి సిహెచ్.అప్పలనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు, సంక్షేమం లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ బస్సుల్లో ప్రస్తుత ఛార్జీ రూ.928 ఉండగా, 20 శాతం తగ్గింపుతో రూ.743 అవుతుందని తెలిపారు. డిసెంబరు ఒకటో తేదీ నుంచి 31వ తేదీ వరకు తగ్గింపు ఛార్జీలు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. శ్రీకాకుళం నుంచి ప్రతిరోజూ సాయంత్రం ఆరు గంటలకు (సర్వీసు నంబరు 2967), విజయవాడ నుంచి ప్రతిరోజూ రాత్రి 7.15 గంటలకు (సర్వీస్ నంబరు 2968) బస్సులు బయలుదేరుతాయని తెలిపారు.

నేడు ఎయిడ్స్ దినోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం 10 గంటలకు ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కె.అనిత ఒక ప్రకటనలో తెలిపారు. అదనపు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి శ్రీకాంత్ ఆధ్వర్యాన జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభమై 7 రోడ్ల జంక్షన్, జి.టి రోడ్డు, చిన్నబజార్ వీధి లైన్ మార్గంలో పాత బస్టాండ్ వరకు కొనసాగి, తిరిగి 7 రోడ్ల జంక్షన్ వద్ద మానవహారం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, సమాజం నుంచి మద్దతు కోసం ప్రోత్సహించడం, నివారణ, సంరక్షణ, ఐక్యత సందేశాన్ని విస్తృతంగా చేరవేయడం ప్రధాన లక్ష్యమన్నారు.

ఆధునిక తెలుగు సాహిత్య మార్గదర్శకులు 'గురజాడ'

ప్రజాశక్తి- రణస్థలం

అభ్యుదయ కవితా పితామహుడు గురజాడ అప్పారావు వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురజాడ చిత్రపటానికి వైసిపి నాయకులు, రణస్థలం ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయి కుమార్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో నాయకులు గురానప్రసాద్, పిన్నింటి లక్ష్మనాయుడు, మహంతి జోగినాయుడు, పాల రాము, మీసాల రామకృష్ణ, మన్నే శ్రీనివాసరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అరసవల్లి: గురజాడ అప్పారావు 111వ వర్ధంతి సందర్భంగా సాహితీ చైతన్య కిరణాలు, బాల కథా నిలయం వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీశ్రీ కళావేదిక జిల్లా కన్వీనర్ బి.ఉమా మహేష్ ఆధ్వర్యంలో గురజాడ రచించిన దేశమును ప్రేమించుమన్నా మంచి అన్నది పెంచుమన్న గేయ సంకలనాన్ని గాంధీమందిరంలో ఆవిష్కరించారు. గురజాడ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక ఉత్తరాంధ్ర అధ్యక్షులు డబ్బీరు గోవిందరావు, కార్యదర్శులు వాడాడ శ్రీనివాస్, ఐఎన్‌డి ప్రసాద్, కిల్లాన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక శాంతినగర్ కాలనీలో గాంధీ స్మారక మందిరం ప్రాంగణంలో గురజాడ విగ్రహం వద్ద తెలుగు రచయితల వేదిక సభ్యులు గురజాడ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో తెరవే ప్రధాన కార్యదర్శి వెంకట రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం : గురజాడ చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న నాయకులు

అరసవల్లి : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

గంజాయి ముఠాలను అరికట్టాలి

పెంచలయ్య హత్యను నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

రాష్ట్రంలో గంజాయి ముఠాలను అరికట్టాలని సాంస్కృతిక, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రజా కళాకారుడు, సిపిఎం నాయకుడు పెంచలయ్య హత్యను నిరసిస్తూ జిల్లాలోని పలుచోట్ల ఆదివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీకాకుళం నగరంలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద పెంచలయ్య మృతికి నివాళిగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రంగాల నాయకులు మాట్లాడుతూ గంజాయి, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పలు కళారూపాలతో ప్రజలను చైతన్యపరుస్తున్న యువ కళాకారుడిని హత్య చేయడం దుర్మార్గమని, ఈ చర్యలను ఖండించాలన్నారు. గంజాయి ముఠా ఒక పథకం ప్రకారం పెంచలయ్యని హత్య చేశాయన్నారు. హత్యకు గల కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నెల్లూరు నగరంలో ఇటీవల కాలంలో విచ్చలవిడిగా పెరిగిపోయిన గంజాయి సంస్కృతికి వ్యతిరేకంగా ఆయన ప్రజలను చైతన్యపరచడానికి అనేక కళారూపాలను రూపొందించి ప్రదర్శించారని చెప్పారు. పోలీస్ శాఖ సహకారంతో కూడా కొన్ని కార్యక్రమాలు చేశారని తెలిపారు. గంజాయి మానండంటూ స్థానికంగా ఫ్లెక్సీలనూ ఏర్పాటు చేశారని, ఇది స్థానిక గంజాయి ముఠాకు ఏమాత్రం నచ్చలేదన్నారు. దీంతో కొంతకాలంగా ఆయన కదలికలపై నిఘా వేసి, హత్య చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మాదకద్రవ్య ముఠాలను పసిగట్టి నివారించడంలో వైఫల్యం చెందాయని విమర్శించారు. పోలీసు నిఘా వ్యవస్థ ఉద్యమాలను అణచివేయడంలో ఉన్న శ్రద్ధ మాదకద్రవ్యాల ముఠాలను నిర్మూలించడంలో విఫలమవుతున్నాయని దుయ్యబట్టారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసు, ప్రజాసంఘాల నాయకులు బి.కృష్ణమూర్తి, పి.తేజేశ్వరావు, కె.నాగమణి, పి.ప్రసాదరావు, ఎ.లక్ష్మి, ఆర్.ప్రకాశరావు, ఎం.గోవర్ధనరావు, ఎ.సత్యం, ఎం.ఆదినారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పలాసలో...

కొత్తూరులో...

శ్రీకాకుళం సిటీ : కొవొత్తులతో నిరసన తెలుపుతున్న నాయకులు

రణస్థలం : రణస్థలం మండల కేంద్రంలో కొవ్వొత్తులు ప్రదర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, సిపిఎం రణస్థలం శాఖ కార్యదర్శి వెలమల రమణ తదితరులు పాల్గొన్నారు.

పలాస : కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద నుంచి ప్రజా కళాకారులు, సామాజిక కార్యకర్తల ఆధ్వర్యాన కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎపి ఎన్‌జిఒ అండ్ గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్, ప్రజా కళాకారుడు కె.హేమసూదన్, సామాజిక కార్యకర్త నక్క అనిల్ కుమార్, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ బల్ల చిట్టిబాబు, పి శశిధర వర్మ, సోమేశ్వరరావు, బి.కృష్ణారావు, కె.సుహాసిని, ఎన్.ఢిల్లేశ్వరి, ఎపి ఎన్‌జిఒ సంఘం ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు : కొత్తూరు మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో సిఐటియు ఆధ్వర్యాన కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిర్ల ప్రసాద్, పలు సంఘాల నాయకులు టి.వెంకటరావు, టి.రాంబాబు, ఎం.త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

రబీలో ఆరుతడి పంటలకు ప్రాధాన్యం

- ఖరీఫ్‌లో 11 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడికి అవకాశం
- రసాయన ఎరువుల వినియోగం తగ్గాలి
- సాగులో సాంకేతిక అవసరం
- జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.మనోహర్ ప్రసాద్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

రబీలో రైతులు ఆరుతడి పంటలకు ప్రాధాన్యతనివ్వాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.మనోహర్ ప్రసాద్ సూచించారు. వరి సాగుతో పోల్చితే ఆరుతడి పంటలు, వాణిజ్య పంటలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల రైతులకు లాభసాటిగా ఉంటుందన్నారు. ప్రస్తుత వ్యవసాయ పద్ధతుల్లో మార్పు అవసరమన్నారు. భూసార పరీక్షలు నిర్వహించి అవసరానికి అనుగుణంగా ఎరువులు వినియోగించాలని చెప్పారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలని, ప్రకృతి వ్యవసాయ సాగు మెరుగుపడాలన్నారు. వ్యవసాయంలో యాంత్రీకరణకు ప్రోత్సాహాన్ని అందిస్తున్నామన్నారు. రాయితీపై ట్రాక్టర్లు, డ్రమ్‌సీడర్లు, డ్రోన్లు వంటివి అందజేస్తున్నామని తెలిపారు. 'ప్రజాశక్తి' ముఖాముఖిలో పలు అంశాలను వెల్లడించారు.

జిల్లాలో ఈ ఖరీఫ్‌లో వరి పంట దిగుబడి ఎలా ఉంది?

ఈ ఏడాది వ్యవసాయానికి వర్షాలు అనుకూలించాయి. దీంతో మంచి దిగుబడి సాధ్యమైంది. ఖరీఫ్‌లో 4.9 లక్షల ఎకరాల వరకు సాగు చేయగా, 11 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడికి అవకాశం ఉంది. అన్ని ప్రాంతాల్లో పంటలు బాగా పండాయి. ప్రస్తుతం వరి కోతలు, నూర్పులు ముమ్మరంగా సాగుతున్నాయి. గత కొన్నేళ్లతో పోల్చితే ఈ ఏడాది వరి పంట మెరుగ్గా ఉంది.

? రబీ సాగు ప్రణాళిక ఏమిటి?

రబీలో ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇస్తున్నాం. రైతులు మొక్కజొన్న ఎక్కువగా సాగు చేస్తున్నారు. మినుము, పెసర వంటి అపరాలనూ సాగు చేస్తున్నారు. రబీకి సంబంధించి అపరాల విత్తనాలనూ రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్నాం. పంటల మార్పిడి, మెరుగైన ఆదాయం వచ్చే పంటల సాగు అవసరం.

? భూసార పరీక్షలు ఎలా సాగుతున్నాయి?

వ్యవసాయంలో భూసార పరీక్షలు కీలకం. భూసారం తెలుసుకుని అందుకనుగుణంగా ఎరువులు వినియోగించాలి. ప్రధానంగా రసాయన ఎరువులు ఎక్కువగా వినియోగించకూడదు. ప్రతి మండలం యూనిట్‌గా భూసార పరీక్షలు చేస్తున్నాం. ఇప్పటికి 5,800 నిర్వహించాం. భూసార పరీక్షలపై రైతుల్లో అవగాహన కల్పిస్తున్నాం.

పిఎం కిసాన్-అన్నదాత సుఖీభవ కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే రెండు విడతలుగా రూ.14 వేలు రైతుల ఖాతాల్లో జమ చేశాయి. జిల్లాలో 2,78,100 మంది రైతుల ఖాతాల్లో ఈ డబ్బులు జమయ్యాయి. అర్హులైన రైతులందరికీ ఈ పథకం అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

? ప్రకృతి వ్యవసాయాన్ని ఎలా ప్రోత్సహిస్తున్నారు?

జిల్లాలో ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు లక్ష ఎకరాల సాగు లక్ష్యంగా ముందుకు సాగుతుంది. సేంద్రియ ఎరువులు, కషాయాలు వినియోగించి పంటలు పండించడం... రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం తగ్గించడం లక్ష్యం. భవిష్యత్‌లో ప్రకృతి వ్యవసాయం విస్తరిస్తుంది. ఈ సాగు ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉంటుంది.

? 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం అమలు తీరు ఎలా ఉంది?

పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పక్కాగా నిర్వహిస్తున్నాం. రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్నాం. విత్తన ఎంపిక, విత్తన శుద్ధి, ఎరువుల వినియోగం, చీడపీడల నియంత్రణ, మెరుగైన దిగుబడికి తీసుకోవాల్సిన చర్యలు వంటి వాటిపై అవగాహన కల్పిస్తున్నాం.

రైతు సేవా కేంద్రం ఆధ్వర్యాన రైతులకు నిరంతరం సూచనలు చేస్తున్నాం. శాస్త్రీయ పద్ధతిలో సాగు వల్ల పంట దిగుబడి పెరగడంతో పాటు యాజమాన్యపు ఖర్చులు తగ్గుతాయి.

ప్రజలను ప్రదర్శిస్తున్న ఉద్యమ కమిటీ ప్రతినిధులు

పవర్‌ప్లాంట్ ప్రతిపాదన రద్దు చేయాలని నిరసన

ప్రజాశక్తి- బూర్జ

ప్రభుత్వం థర్మల్ పవర్ ప్లాంట్ ప్రతిపాదన రద్దు చేయాలని నినాదంతో గిరిజన గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్టు థర్మల్ పవర్ ప్లాంట్ వ్యతిరేక ఉద్యమ కమిటీ ప్రతినిధులు సింహాచలం, లక్ష్మణరావు తెలిపారు. ఆదివారం తిమడాంలో ఇందుకు నిరసనగా ప్రజలను చైతన్యపరచడం చేశారు. ఎమ్మెల్యేతో పాటు ప్రభుత్వ థర్మల్ పవర్‌ప్లాంట్ ఆలోచనను విరమిస్తున్నట్టు ప్రకటన వచ్చేంతవరకు పోరాటం ఉధృతం చేస్తామని తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 29 నుంచి డిసెంబర్ 5 వరకు గిరిజన గ్రామాల్లో ప్రతిరోజు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ముఖ్యంగా 1న పింఛన్ పంపిణీని తిరస్కరించడం జరుగుతుందన్నారు. కేవలం స్వార్థ ప్రయోజనాల కోసం చేయడం సరికాదన్నారు. ఈ ప్రాంతంలో థర్మల్ పవర్‌ప్లాంట్ ఏర్పాటు చేయబడితే గిరిజనుల మనుగడకు తీవ్ర విఘాతం కలుగుతుందన్నారు. ప్రజాప్రతినిధులకు, ప్రభుత్వానికి తెలియజేసినప్పటికీ మొండి పట్టుదలతో తాము అనుకున్నది సాధించేందుకు, కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాసేందుకు ప్రభుత్వం పూనుకోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వం సరైన ప్రకటన చేయాలని వారు కోరారు.

నగదు అందజేస్తున్న మోహిని స్నేహితులు

ఆపదలో స్నేహహస్తం

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

కవిటి: అనుకోని ప్రమాదంలో భర్తను కోల్పోయి ముగ్గురు పిల్లలతో దయనీయ స్థితిలో ఉన్న గొండ్యాలపుట్టుగ గ్రామానికి చెందిన మోహినికి ఆమె స్నేహితులు అండగా నిలిచారు. గొండ్యాల పుట్టుగ గ్రామానికి చెందిన బైరెడ్ల రమేష్ అనుకోని ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. దీంతో రమేష్ భార్య మోహిని, ముగ్గురి పిల్లలు దిక్కులేని వారయ్యారు. దీనిపై నవంబర్ 14న మావయ్య.. నాన్నేరి అంటూ ప్రజాశక్తి కథనాన్ని ప్రచురించింది. దాంతో దాతలు ఆ కుటుంబానికి అండగా నిలుస్తున్నారు. ఆ కోవలో మోహినితో 2007 - 08 ఏడాది పదోతరగతి చదివిన మిత్రులు తలో కొంతవేసుకున్నారు. ఆ విధంగా చేకూరిన రూ.23,700 ఆదివారం ఉదయం మోహినికి అందించారు. అధైర్యపడొద్దు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. దయనీయ స్థితిలో ఉన్న తమ స్నేహితురాలికి దాతలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మోహినితో పాటు చదువుకున్న స్నేహితులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హోటల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

బూర్జ: రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అన్ని ప్రాంతాల్లోనూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని మదనాపురంలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్దతు ధరకు కొనుగోలు చేసిన కొద్ది సమయంలోనే వారి ఖాతాలోకి నగదు జమ చేయడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా అర్హులైన రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం నగదును జమ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ రామకృష్ణ నాయుడు, నీటి సంఘం అధ్యక్షులు కడగల కృష్ణ, మండల బిసిసెల్ అధ్యక్షులు మామిడి దుర్గారావు, ఆదినారాయణ, టిడిపి ప్రజా ప్రతినిధులు లంక జనార్ధన, మజ్జి అప్పలనాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జర్నలిస్టుల హక్కుల సాధనకు కృషి

నరసన్నపేట: జర్నలిస్టుల హక్కులు, సమస్యలపై పోరాడేందుకు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ముందుంటుందని ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాలరావు అన్నారు. ఆదివారం నరసన్నపేట ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో నరసన్నపేట ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే వెటర్న్ జర్నలిస్టుల పెన్షన్ కోసం, గౌరవ వేతనం కోసం, ఇళ్ల స్థలాల కోసం, అక్రిడేషన్ల కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తుందన్నారు. 45 ఏళ్లు దాటిన వారికి ప్రభుత్వం పింఛన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎస్. భాస్కరరావు, డెస్క్ జర్నలిస్టుల ప్రతినిధి బి.ప్రసాదరావు, ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు సదాశివుని కృష్ణ, నరసన్నపేట ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు గంగు మన్మధరావు, ప్రధాన కార్యదర్శి పంగ రమణ, గౌరవ అధ్యక్షులు గురుగుబెల్లి నర్సింగరావు, ఫ్రీ లాన్సర్ గౌరీ శంకర్, తండ్యాల జనార్ధనరావు, నెయ్యిల నారాయణరావు, సిహెచ్ విశ్వేశ్వరరావు, పి.వి.ఎస్.ఎన్ మూర్తి, యాబాజి రాము, శరత్‌బాబు, ఎస్.ఎస్ భాస్కరరావు, ఎన్‌టివి మధుసూదనరావు, సత్యనారాయణ, డి.గిరిధర్, కరణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వేణుగోపాలరావు

సిబ్బంది నిల్... పనులు ఫుల్

- వేధిస్తున్న సిబ్బంది కొరత
- నత్తనడకన సాగుతున్న పనులు

ప్రజాశక్తి- కవిటి

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ముఖ్య నాయకులకు వేదికైన కవిటి మండలం పాలనా పరంగా వెనుకబడుతోంది. ముఖ్యంగా మండలంలో ప్రభుత్వ సిబ్బంది కొరత వేధిస్తోంది. ఒకవైపు ప్రభుత్వ సర్వేల మీద సర్వేలు, మరోవైపు పనులు పురమాయిస్తుండే మరోవైపు ప్రజలు తమ అవసరాలకు సచివాలయాలకు వెళ్లడంతో అక్కడ సిబ్బందిలేమితో పనులు జరగక ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. సచివాలయ వ్యవస్థకు ఆయువుపట్టైన డిజిటల్ అసిస్టెంట్ పోస్టులు 12, వెల్ఫేర్ అసిస్టెంట్ పోస్టులు 7 ఖాళీగా ఉన్నాయి. దీంతో ముఖ్యమైన పనులు, సర్వేలకు తీవ్ర విఘాతం కలుగుతోంది. కీలకమైన ఈ రెండు విభాగాల్లో ఖాళీలు మొత్తం వ్యవస్థపై ప్రభావం చూపిస్తున్నాయి. ఇక వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులు 3 ఖాళీగా ఉన్నాయి. డిపార్ట్మెంట్ పరంగా కవిటి పశు వైద్యశాలలో ఒక డాక్టర్, ఒక అసిస్టెంట్, బొరివంక ఆస్పత్రిలో ఒక డాక్టర్, ఒక అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో రైతులకు గోపాలమిత్రలే దిక్కవుతున్నారు. వీటితో పాటు ముగ్గురు వెటర్నరీ లీవ్‌లో ఉండగా మరొకరిద్దరు మెడికల్ లీవులు కొనసాగిస్తున్నారు. వెరసి మిగతా సిబ్బందిపై ఈ భారం పడడంతో సదరు సిబ్బంది మింగలేక, కక్కలేక పనులు చేస్తున్నారు. ఇక మేజర్ పంచాయతీ కవిటిలో ఇఒ పూర్తిస్థాయిలో విధులు నిర్వహించ లేకపోవడం పెద్ద లోపంగా మారుతోంది. దీంతో ప్రభుత్వం చేపడుతున్న పనుల్లోనే కాకుండా క్షేత్రస్థాయిలో కూడా మేజర్ పంచాయతీ స్వరూపం వెనకబడుతోంది. మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్, రెండు ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తహశీల్దార్ కార్యాలయంలో రెండు ఆపరేటర్ పోస్టులు, రెండు సచివాలయాల్లో విఆర్ఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉపాధిహామీలో ఇన్‌ఛార్జ్‌ల పాలన కొనసాగుతోంది. రెగ్యులర్ ఎపిఒ లేకపోవడం, ఇటీవల కవిటిలో పనిచేసిన పిడి రిలీవ్ ఉపాధి హామీ సిబ్బంది కనీస సమాచారం లేకుండా హాజరవ్వడం ఆ శాఖ పనితీరుకు అర్థం పడుతోంది. ప్రధానమైన నాయకులకు నెలవైన కవిటి మండలంలో ఇటువంటి పరిస్థితి ఉండడం తీవ్రమైన విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా నాయకులు స్పందించి వ్యవస్థలు సక్రమంగా నడిచేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కవిటి సచివాలయం

కళాశాలను తరలించొద్దు

ప్రజాశక్తి- మందస

బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాలుగు దశాబ్దాలుగా ఇంటర్మీడియట్ విద్యను అందిస్తున్న మందస ప్రభుత్వ జూనియర్ కళాశాలను మారుమూల ప్రదేశమైన కళాశాల గ్రౌండ్ వద్దకు తరలించాలనే ఆలోచనని విరమించుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనారి మోహనరావు అన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యా సంస్థల అభివృద్ధికి మాట్లాడుతున్నవారు ప్రభుత్వ రంగంలోనున్న విద్యాలయాన్ని దురాక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఇప్పటికే కాలేజీలోని తూర్పు ఈశాన్యంలో 5 అడుగుల వెడల్పుతో 45 అడుగుల పొడవునా ఆక్రమించు కున్నారన్నారు. చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా ఇప్పటివరకు ఎటువంటి హక్కులు పెరుమాల్ ట్రస్ట్‌కు లేకపోయినప్పటికీ ఈ విధంగా దౌర్జన్య పూరితంగా ఆక్రమించడాన్ని ప్రజలు ప్రజాస్వామ్య వాదులు ఖండించాలని పిలుపునిచ్చారు. సుమారు 15 వేల మంది జనాభాతో మండల కేంద్రంగా ఉన్న మందస పట్టణంలో డిగ్రీ కళాశాలకు నోచుకోకపోవడం పాలక వర్గాల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలను కాపాడుకోవాలని అయన ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్.దిలీప్‌కుమార్, పురుషోత్తమ బెహరా, వడ్డి గోపాల్, నిరంజన బెహర, ప్రదీప్, మామిడి కోదండరావు తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న మోహనరావు తదితరులు

నీటి శుద్ధి ప్లాంట్ ప్రారంభం

పలాస: ఉద్దానంలో కిడ్నీవ్యాధికి మూలం భూగర్భజల కాలుష్యమని భావించబడుతుండడంతో నివారణా చర్యల్లో భాగంగా చిన్నమాకనపల్లి గ్రామ సంక్షేమ సేవా సంఘం 2018 మార్చి 30న శ్రీశ్రీశ్రీ చింతల పోలమ్మ నీటి శుద్ధి ప్లాంట్ ఏర్పాటు చేసుకున్నారు. ప్లాంట్‌కు కావాల్సిన యంత్ర పరికరాలు జుత్తు తాతారావు, గ్రామానికి చెందిన అండమాన్ సంఘం, గ్రామ సంఘం సంయుక్త సహకారంతో నెలకొల్పారు. అప్పటినుంచి గ్రామస్తులు ఆ ప్లాంట్‌లో శుద్ధి చేయబడిన నీటిని తాగడం వలన ఎటువంటి వ్యాధి లక్షణాలు గ్రామంలో ఇంతవరకు బయట పడలేదు. కాగా గత కొంతకాలంగా ప్లాంట్ మరమ్మతులకు గురికావడంతో తిరిగి తమ గ్రామానికి చెందిన డాక్టర్ తెప్పల ఆనంద్, జుత్తు తాతారావు, అండమాన్ సంఘం సహకారంతో పూర్తిస్థాయిలో మరమ్మతులు నిర్వహించి ఆదివారం డాక్టర్ తెప్పల ఆనంద్ చేతులమీదుగా పున్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సంఘ అధ్యక్షులు తెప్పల అజయ్ కుమార్ మాట్లాడుతూ మంచినీటి విషయంలో గ్రామ సంఘం వారు స్వయంగా నిర్వహించుకోవడం తప్ప, ప్రభుత్వ పరంగా ఎటువంటి సహకారాలు అందలేదన్నారు. అంతేకాకుండా సుజలధార పథకం ద్వారా ట్యాంకులు నిర్మించినప్పటికీ ఇంతవరకు శుద్ధ జలం తమ గ్రామానికి అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యవర్గ సభ్యులు బత్తిని ప్రసాద్, జుత్తు కొండలరావు, బత్తిని దుర్గారావు, జుత్తు కిషోర్, తెప్పల రాజు, తెప్పల మోహిని, మల్లెన వెంకటమ్మ, శాలిన మురళి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్లాంట్‌ను పున:ప్రారంభిస్తున్న ఆనంద్ తదితరులు

అభాగ్యులను ఆదుకోవాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

అభాగ్యులను ఆదుకోవడానికి ప్రతీఒక్కరూ మానవతా దృక్పథంతో ముందుకు రావాలని ఉద్దానం అభ్యుదయ సేవాసమితి వ్యవస్థాపకులు తామాడ లక్ష్మణరావు అన్నారు. ఆదివారం పూండి చెరువు గట్టుపై నివాసముంటున్న పాలిన బుద్దెమ్మకు సంస్థ తరుపున రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. బాధితురాలు కొంత కాలంగా గుండె జబ్బుతో బాధపడుతుంది. రెక్కాడితే గానీ డొక్కాడని బ్రతుకు. రోజు గడవడమే చాలా కష్టంగా ఉందని తెలుసుకున్న సంస్థ సభ్యులు తమవంతు సహకారం అందించడానికి ముందుకొచ్చారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు గుంటు విజయ్, మండల మహేష్, బొడ్డు బాబూరావు, కోరన్న తిరుపతి, దండుపాటి పవన్‌కుమార్, చొక్కల శంకర్, మాగుబరి చందు, అంగ సీత, గణగళ్ల ఉమా తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

చురుగ్గా సాగుతున్న మరమ్మతు పనులు

శరవేగంగా మరమ్మతుల పనులు

మెళియాపుట్టి : పలాస - బెండి గేటు, మందస - పట్టుపురం తారురోడ్డు మరమ్మతు పనులు పురోగతిలో ఉన్నాయి. పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆదేశాల మేరకు రూ.15 లక్షలతో జరుగుతున్న ఈ పనులను డిసెంబర్ 15లోగా పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ ఎరుసు శ్రీనివాసరెడ్డి తెలిపారు. రహదారి పాడవ్వడంతో ప్రయాణికుల ఇబ్బందుల నేపథ్యంలో మరమ్మతులు చేపట్టినట్లు ఆయన చెప్పారు.

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

లావేరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి గ్రంథాలయంలో పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సహాయకుడు వీరభద్రుడు, పాఠకులు పాల్గొన్నారు.

విరివిగా మొక్కలు నాటాలి

ఇచ్ఛాపురం: ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని యువ సూర్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎం.రాంబాబు అన్నారు. ఆదివారం యువసూర్య చారిటబుల్ ట్రస్టు మాసోత్సవాల సందర్భంగా ట్రస్టు చైర్మన్, న్యాయవాది రాంబాబు ఆధ్వర్యంలో రత్తకన్న రోడ్డుకు ఇరువైపుల మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రేమ్ సాహు, కె.ధర్మరాజు, బత్తిన కృష్ణయ్య, యువత పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

టెక్కలి: పట్టుశాలి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. పట్టు శాలిసంఘ గౌరవ అధ్యక్షులుగా పమ్మిన సింహాచలం, అధ్యక్షులుగా మల్లిపెద్ది మధుసూదన రావు, ప్రధాన కార్యదర్శిగా దున్న సాంబశివరావు, కోశాధికారిగా వడగ అశోక్ కుమార్, ఉపాధ్యక్షులుగా బుడ్డు నందికేశ్వరరావు, ఆట్ల రవి, సంయుక్త కార్యదర్శిగా మాడుగుల మహేష్‌కుమార్, రఘు, 20 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

నీలవుపుట్టుగలో 'రైతన్నా మీకోసం'

ఇచ్ఛాపురం: మండలంలోని కేసుపురం పంచాయతీ నీలవుపుట్టుగలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతన్నా మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిపి దక్కత ఢిల్లీరావు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న రైతు సంక్షమ పథకాలు సద్వినియోగం చేసుకోవాన్నారు.

కోటి సంతకాల సేకరణ

మెళియాపుట్టి: కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేయొద్దని మండల వైస్ ఎంపిపి ఎస్.ఆదినాయుడు డిమాండ్ చేశారు. మండలంలోని పరశురాంపురం పంచాయతీలోని టికెఆర్‌పురం, రామచంద్రపురం గ్రామాల్లో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆదివారం సంతకాలను సేకరించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ తెంబూరు ప్రసాదరావు, బూత్ కన్వీనర్లు విశాఖ, వసంత్, కార్యకర్తలు గిరిబాబు, రంగయ్య, రాంప్రసాద్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

బూర్జ: మండలంలోని రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల వ్యవసాయ శాఖ అధికారి డి.ఉషారాణి తెలిపారు. బంగాళా ఖాతంలో అల్పపీడనం కారణంగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఆకాశం మేఘావృతమై ఉందన్నారు. ఏ సమయంలోనైనా వర్షాలు పడితే రైతులు నష్టపోయిన పరిస్థితి ఉంటుందన్నారు. ముందస్తుగా రైతులు కోతలను కోసిన వరి చేనును నూర్పులు చేసి ధాన్యం బస్తాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. కళ్లాల్లో ధాన్యం బస్తాలు ఉంచరాదని సూచించారు.

ఉషారాణి, ఎఒ

విశాఖ నేవీ డేలో రాజేష్

ఇచ్ఛాపురం: విశాఖ పట్నంలో నేవీ డే సెలబ్రేషన్స్ జరుపుకునేందుకు వీలుగా ఆదివారం విశాఖ పట్నం సంధ్య మెరైన్స్ వారు 10 కె రన్ నిర్వహించారు. సంధ్య మెరైన్స్ నిర్వహించిన 10 కె రన్‌లో పాల్గొన్న జనసేన నాయకులు, జిల్లా ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లొల్ల రాజేష్ 10 కె రన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేష్‌కు సంధ్య మెరైన్స్ ఎబిడి మెడల్స్ అందించారు. నేవీ డే సందర్భంగా సంధ్య మెరైన్ నిర్వహించిన 10 కె రన్‌లో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని రాజేష్ అన్నారు.

ఎబిడి మెడల్ అందుకున్న రాజేష్

పిఆర్‌టియు ఆధ్వర్యాన మోడల్ పరీక్ష

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పిఆర్‌టియు టీచర్స్ సంఘం ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్ మోడల్ పరీక్షను మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ పాఠశాలలకు చెందిన 250 మంది విద్యార్థులు మోడల్ పరీక్ష రాశారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 విశ్వనాథం, పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు, హైస్కూల్ హెచ్ఎం సూర్యారావు, పిఆర్‌టియు పట్టణ అధ్యక్షులు పి.చంద్రశేఖరరావు, అప్పన్న, ఫాల్గుణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిభా పరీక్షకు స్పందన

సోంపేట: పట్టణంలోని కొంచాడ రాజేశ్వర రావు విద్యా సంస్థలు (కెఆర్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూట్) లో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రతిభా పరీక్షకు విశేష స్పందన లభించింది. పరీక్షకు 759 మంది విద్యార్థిని, విద్యార్థులు హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. పరీక్షలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం పొందిన విద్యార్థులకు వరుసగా రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలుతో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని ఇవ్వనున్నట్టు విద్యాసంస్థల కరస్పాండెంట్ కొంచాడ శేషాద్రి తెలిపారు. పరీక్ష నిర్వహణలో ప్రిన్సిపాళ్లు జయశంకర్, తేజేశ్వర రావు, మణి కుమార్, కళాశాల లెక్చరర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభా పరీక్షను రాస్తున్న విద్యార్థులు

కిటకిటలాడిన అరసవల్లి

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్య నారాయణ స్వామిని ఆదివారం అధిక సంఖ్యలో యాత్రికులు దర్శించు కున్నారు. యాత్రికులకు ఆలయ ఇఒ ప్రసాద్ ఆధ్వర్యంలో టెంట్లు వేసి, క్యూలైన్‌లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దర్శనాలు కల్పించారు. ఈ సందర్భంగా రూ.6 లక్షల 86 వేల 719 ఆదాయం వచ్చినట్లు ఇఒ తెలిపారు. తెలిపారు. టికెట్లు అమ్మకాల ద్వారా రూ.3 లక్షల 70,100, పూజలు, విరాళాల రూపంలో రూ.79 వేల 459, ప్రసాద విక్రయాల ద్వారా రూ.2 లక్షల 37, 160 ఆదాయం వచ్చిందని తెలిపారు.

క్యూలైన్‌లో ఉన్న యాత్రికులు

నూతన కార్యవర్గం ఎన్నిక

పొందూరు: మండల కేంద్రంలోని ఒకటో నెంబర్ పాఠశాలలో ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మజ్జి మధన్మోహన్, జిల్లా కార్యదర్శి పప్పల తిరుమలరావు ఆధ్వర్యంలో ఆదివారం ఎపిటిఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా మొగదాల రమణారావు, ఉపాధ్యక్షు లుగా రఘుపతి రఘువునాయుడు, గుడిశా జవహర్ గుప్తా, చింతాడ విజయబాల, దండా శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శులుగా గురుగుబిల్లి శ్రీనివాసరావు, దుంపల శ్రీనివాసరావు, దుంపా రవికుమార్, పైడి రవిబాబు, పప్పల రమణమూర్తి, మాడుగుల రోజా, తూతిక పాపారావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పేడాడ లక్ష్మణరావు, కోరుకొండ విజయ్ కుమార్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న నూతన కార్యవర్గం

చంటి మృతదేహం

డొంకూరు చేరిన మృతదేహం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పొట్ట కూటికోసం దుబాయ్ దేశం వలస వెళ్లిన యువకుడు డొంకూరు గ్రామ వాసి అయిన బడే చంటి (21) ఈ నెల 24న ఫోర్ జోన్ ఇండస్ట్రీస్ కంపెనీలో ఎవరూ లేని సమయంలో బలవన్మరాణానికి పాల్పడి మృతి చెందాడు. ఈ మృతిపై కుటుంబసభ్యులు అనుమానాలు వ్యక్తపరుస్తున్నారు. అనంతరం ఫోర్ జోన్ ఇండస్ట్రీస్ కంపెనీ వారితో, ఇండియన్ అసోసియేషన్ వారితో సుమారు మూడు రోజులు ముమ్మరంగా సంప్రదింపులు జరిపిన జనసేన ఇచ్ఛాపురం మండల నాయకులు చీకటి కృష్ణయ్య, తెలుగు కమ్యూనిటీ గల్ఫ్ కార్మికుల రక్షణ సమితి అధ్యక్షుడు నరసింహ సహాయంతో మృతదేహాన్ని హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు రప్పించి అనంతరం హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి అంబులెన్స్ ద్వారా మృతుడు స్వగ్రామం డొంకూరు తెప్పించారు. ఆదివారం దహన సంస్కరణ కార్యక్రమం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామ ప్రజల మధ్య జరిగింది. కార్యక్రమంలో బూర్జపాడు పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి బుడ్డ రిషి (కళ్యాణ్), బడే రామారావు, చాలాపరాయి చిన్నారావు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గాయపడ్డ వ్యక్తి మృతి

నందిగాం: మండలం లట్టిగాం వద్ద జాతీయ రహదారిపై ఈనెల 27న గురువారం జరిగిన ప్రమాదంలో గాయపడ్డ భామిని మండలం భామిని గ్రామానికి చెందిన బి.సుదర్శనరావు (42) విశాఖ పట్నం కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు నందిగాం పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి లక్ష్మణరావు

3 కిలోల గంజాయి స్వాధీనం

పలాస: ఒడిశా రాష్ట్రంలో లగేజి వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్న నవన కుమార్ బబిత్రా అనే వ్యక్తి 13 కిలోల గంజాయిని అక్రమంగా సోలాపూర్ తరలిస్తుండగా గంజానికి స్వాదీనం చేసుకొని అరెస్ట్ చేసినట్టు కాశీబుగ్గ ఇన్‌ఛార్జి డిఎస్‌పి లక్ష్మణరావు తెలిపారు. కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నిందితుడుకు పర్లాకిమిడిలో ఏర్పడిన పరిచయాలతో అక్కడ వారి నుంచి 13 కిలోల గంజాయి కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయించేందుకు పర్లాకిమిడి నుంచి పలాసకు బస్సులో చేరుకొని షోలాపూర్ వెళ్లేందుకు పలాస రైల్వేస్టేషన్‌కు వెళ్తుండగా సమాచారం మేరకు సవన కుమార్ బబిత్రాను పట్టుకొని అరెస్ట్ చేసి గంజాయిని స్వాదీనం చేసుకొని కోర్టుకు తరలించామని తెలిపారు. సమావేశంలో సిఐ పి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

ఉత్తరాంధ్రలో పలు చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలతో పాటు, ఐదు తులాల వెండి, 12 తులాల బంగారం స్వాదీనం చేసుకోవడం జరిగిందని, ఈ కేసులో నిందితులుగా ఉన్న ఎచ్చెర్ల మండలం దువ్వలవలసకు చెందిన బూసర లక్ష్మణరావు, శ్రీకాకుళం టౌన్ గుజరాతిపేటకు చెందిన పింద్రాల చిన్నిలను అరెస్ట్ చేయడం జరిగిందని ఇన్‌ఛార్జి డిఎస్‌పి తెలిపారు. కాశీబుగ్గలో పలుచోట్ల చోరీ చేసిన నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకోవడం జరిగిందని, శ్రీకాకుళం పిఎన్ కాలనీలో ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఇంటి తలుపులు బద్దలు కొట్టి బీరువాలోని ఐదు తులాల వెండిని నిందితులు చోరీ చేశారన్నారు. అదే విధంగా బొబ్బిలి వెలమలవీధిలో తాళాలు వేసి ఉన్న ఇంటిని తాళలు, బద్దలుగొట్టి బీరువా తలుపులు ఇనుప రాడ్డుతో పగలగొట్టి 12 తులాల బంగారాన్ని నిందితులు చోరీ చేశారన్నారు. వీరిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించామన్నారు.

పూరిల్లు దగ్ధం

లావేరు: మండల కేంద్రంలోని పెద్దవీధి సమీపంలో శనివారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి గ్రామానికి చెందిన నడుపూరి రత్నంకు చెందిన పూరిల్లు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. కాగా ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవ్వరు లేరు. రత్నం కుటుంబంతో కలిసి ఇటీవల హైదరాబాద్ తమ బంధువుల ఇంటికి వెళ్లాడు. ప్రమాద సమయంలో ఎవరూ ఇంట్లో లేకపోవడంతో మొత్తం ఇంట్లో ఉన్న మంచం, దుస్తులు, రెండు బీరువాలు, టీవీ తదితర సామగ్రి కాలిబూడిదైంది. స్థానికుల సమాచారంతో రణస్థలం అగ్ని మాపక వాహనం వచ్చి మంటలను నిలుపుదల చేసింది. ఆస్తి నష్టం రూ. రెండు లక్షల మేర నష్టం వాటిల్లింది. విఆర్ఒ రమేష్, రెవెన్యూ సీనియర్ సహాయకులు రత్నాకర్ ఆదివారం కాలిపోయిన ఇల్లును పరిశీలించి ఆస్తినష్టాన్ని అంచనా వేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన తక్షణ సహాయాన్ని బాధితునికి అందజేయడం జరుగుతుందని చెప్పారు.

కాలిపోయిన పూరిల్లు

ప్రజాప్రతినిధులంటే అంత చులకనా?

కూటమి ప్రభుత్వంలో అధికారులే పాలకులా?
మండల సమావేశంలో సభ్యుల ఆగ్రహం

ప్రజాశక్తి- కవిటి

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సర్పంచ్‌లు, ఎంపిటిసిలను పట్టించుకోకుండానే అధికారులు తమ ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఎంపిపి కడియాల పద్మప్రకాష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఇదే అంశంపై వాదోపవాదాలు జరిగాయి. వ్యవసాయ శాఖ చర్చ సందర్భంగా అన్నదాత సుఖీభవ పథకం ఈ ఏడాది మండలంలోని 50 శాతం రైతులకు మాత్రమే జమ కావడంపై ఎమ్మెల్సీ రామారావు అధికారులను ప్రశ్నించారు. దీనిపై వ్యవసాయ శాఖాధికారి శ్రీదేవి వెబ్‌ల్యాండ్‌లో పేర్లు ఉన్నవారికే రైతు భరోసా వర్తిస్తుందని చెప్పగా సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై తహశీల్దార్ మురళీమోహనరావు స్పందిస్తూ 'మండలంలో 2034 జాయింట్ ఎల్‌పిఎంలు ఉండడం వల్ల కొందరికి రైతు భరోసా పడలేదు, సవరణలు జరుగుతున్నాయని చెప్పినా సభ్యుల ఆగ్రహం చల్లారలేదు. అదే సమయంలో బొరివంక సచివాలయంలో డిఎ, వ్యవసాయ సహాయకుడు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉండటంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ బెందాలం శ్రీరామ్ ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. 'ప్రభుత్వం ఇచ్చిన సచివాలయ వ్యవస్థలో సిబ్బంది లేకపోతే ప్రజా సమస్యలు ఎలా పరిష్కరిస్తాం?' అని ప్రశ్నించారు. అనంతరం జరిగిన గృహనిర్మాణ శాఖ చర్చలో కపాసుకుద్దిలో గృహసర్వేలో ఎటువంటి సమాచారం ఇవ్వకుండా 40 ఇళ్ల స్థానాలను ఒక్కసారిగా మార్చేస్తే ఎలా అని సర్పంచ్ ప్రతినిధి కాయ భీమసేన్ నిలదీశారు. హౌసింగ్ అధికారులు కనీసం సమాచారం ఇవ్వకుండానే తమ పంచాయతీల్లో విధులు నిర్వహించడం సరికాదని సర్పంచ్‌లు ఎస్‌పి నారాయణ స్వామి, దూగాన భద్రాచలం ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని పంచాయతీల్లో ఇప్పటికే ఇళ్ల మంజూరు పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారని వారు ఆరోపించారు. ఈ క్రమంలో ఎంపిపి మాట్లాడుతూ మండలంలో అధికారుల నిర్ణయాల్లో ప్రజాప్రతినిధులకు చోటు లేకపోవడం బాధాకరం. నాకే సమాచారం ఇవ్వకుండా కార్యక్రమాలు నిర్వహిస్తే ఎలా? ఇకపై ఇలాంటి తీరు సహించం' అని హెచ్చరించారు. 'ఇకముందు తప్పులు జరగకుండా చూస్తాం' అని అధికారులు హామీతో సమావేశం ముగిసినా, ప్రజా ప్రతినిధుల్లో అసంతృప్తి ఏ మాత్రం తగ్గలేదు. సమావేశంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపిడిఒ ఎల్.త్రినాద్, డిప్యూటీ ఎంపిడిఒ వరప్రసాద్, ఎస్ఐ రవివర్మ, వైస్ ఎంపిపి కర్రి గోపయ్య, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

హౌసింగ్ ఎఇని నిలదీస్తున్న ప్రజాప్రతినిధులు

హెచ్‌ఐవి నియంత్రణలో ఐసిటిసి సేవల సత్ఫలితాలు

ప్రజాశక్తి- సోంపేట

హెచ్‌ఐవి బారిన పడిన ఎన్నో కుటుంబాలకు కౌన్సెలింగ్, ఎఆర్‌టి చికిత్సా విధానం ద్వారా ఊరట లభించినట్టయిందని ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ తుంగాన వెంకటేశం అన్నారు. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ద్వారా హెచ్‌ఐవిపై అవగాహన కల్పించడం, అవసరమైన వారికి నిర్ధారణా పరీక్షా కేంద్రాలు ఏర్పాటు, కౌన్సిలింగ్ కేంద్రాల ద్వారా ప్రవర్తనా లోపాలను సరి చేయుట, లైంగిక వ్యాధుల నిర్ధారణ, చికిత్స, కండోమ్ వాడకం, హెచ్‌ఐవి తీవ్రతను లెక్కించే పరీక్ష కేంద్రాలు నెలకోల్పడం జరిగిందన్నారు. అలాగే అందరికీ అందుబాటులో ఎఆర్‌టి చికిత్సా కేంద్రాలు విడతల వారీగా నెలకొల్పడం వలన ఈ వ్యాధి అదుపులోకి వచ్చిందన్నారు. కొన్ని ప్రాంతాల్లో హెచ్‌ఐవి/ఎయిడ్స్ వ్యాధిపై పూర్తి అవగాహన లేకపోవడం వలన ఇప్పటికీ కొత్త కేసులు నమోదవుతున్నాయన్నారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో సోంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ఐసిటిసి కేంద్రాన్ని నెలకొల్పిన నాటి నుంచి 2020 వరకు 645 కేసులు నమోదు కాగా 2020 నుంచి 2025 వరకు తక్కువ సంఖ్యలో నమోదయ్యాయని తెలిపారు. జాతీయ స్థాయిలో జరుగుతున్న అంచనాల మేరకు పూర్తిస్థాయిలో కొత్త కేసులు నమోదు కావడంలో వెనుకంజలో ఉందని, ఈ ప్రాంతంలో నెలకొల్పిన ఐసిటిసి కేంద్రం ద్వారా హెచ్‌ఐవిపై అనుమానం ఉన్నవారు, వివిధ అనారోగ్యాలతో ఆస్పత్రికి వచ్చిన వారు, సుఖ వ్యాధులు ఉన్నవారు, క్షయవ్యాధి బారిన పడినవారి ప్రవర్తన శైలిలో మార్పు కొరకు నిపుణులైన సిబ్బందితో కౌన్సిలింగ్ నిర్వహించి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నామన్నారు. హెచ్‌ఐవిగా నిర్ధారించిన వ్యక్తులకు ఎఆర్‌టి కేంద్రానికి పంపి వారి వైరల్‌లోడ్ రిపోర్టుల ఆధారంగా మందులు అందించేలా చర్యలు తీసుకుంటు న్నామన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కొన్ని స్వచ్ఛంద సంస్థలు పని చేయడమే కాకుండా, హైస్కూల్ స్థాయి విద్యార్థి నుంచి డిగ్రీస్థాయి వరకు బృందసభ్యులు ఏర్పాటు కూడా జరిగిందన్నారు. తద్వారా ఎక్కువ మందికి అవగాహన ఏర్పడిందని, అయితే ఆ స్థాయిలో హెచ్‌ఐవి పరీక్షలు చేయించుకోవడానికి ప్రజలు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. నిపుణులైన సిబ్బంది సేవలు పూర్తిస్థాయిలో వినియోగించుకుంటే మన ప్రాంతంలో మరుగున పడిన హెచ్‌ఐవి కేసులు బయటపడటంతో పాటు హెచ్‌ఐవి సంక్రమణ కూడా సులభంగా తగ్గించు కోగలమని స్పష్టం చేశారు. హెచ్‌ఐవి ఉన్నవారికి, ఎఆర్‌టి మందులు వాడుతున్న వారికి ప్రభుత్వం పింఛను కూడా అందిస్తుందని, ఎవరైతే క్రమం తప్పకుండా మందులు వాడుతారో వారికి మాత్రమే ప్రోత్సహిస్తూ పింఛను అందజేయడం జరుగుతుందన్నారు. అలాగే హెచ్‌ఐవితో బాధపడుతూ చదువుకుంటున్న విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం సహాయాన్ని అందజేస్తుందని తెలిపారు. పౌష్టికాహారాన్ని తీసుకుంటూ క్రమం తప్పకుండా ప్రభుత్వం ద్వారా వస్తున్న మందులను వాడుకోవడం వలన ఆరోగ్యవంతమైన జీవితాన్ని అనుభవిస్తూ వారి బాధ్యతలను నెరవేర్చుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి ఐసిటిసి కేంద్రాల సేవలు, ఎల్‌ఎసి సేవలు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయని తెలిపారు.

వెంకటేశం, మెడికల్ ఆఫీసర్